

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి వంకేశ్వరం కృష్ణప్రసాద్(32) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన కృష్ణ ప్రసాద్ ఈ నెల 10న నాగర్‌కర్నూల్ నుంచి బైక్‌పై నాగనూలు వెళ్తుండగా అడ్డొచ్చిన కుక్కను తప్పించే క్రమంలో కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీఎం శ్రీ యోజనకు
నిధులేవీ..?

- 2022లో అట్టహాసంగా ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- నిధులు లేక డిజిటల్ విద్యకు దూరమవుతున్న విద్యార్థులు
- చొరవ చూపని ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు



పీఎం శ్రీ యోజన పథకానికి ఎంపికైన అయిజ బాలుర పాఠశాల

అయిజటౌన్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పేదపిల్లలు చదువుకునే ప్రభుత్వ బడులను బలోపేతమే లక్ష్యంగా 2022 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ యోజన పథకాన్ని ప్రారంభించింది. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పేరుతో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను ఏటా ఎంపిక చేసిన పాఠశాలలకు నిధులు విడుదల చేస్తూ 2026-27 వరకు కొనసాగించాలని నిబంధనలు పొందుపరిచారు. ప్రారంభ సమయంలో ఎంతో ఆర్భాటం చేసిన ప్రభుత్వాలు మొదటి ఏడాదిలో కొంత మెరుగ్గా నిధులు విడుదల చేసినప్పటికీ, రెండో ఏడాది 2023-24లో అరకొరగానే విడుదల చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మూడో సంవత్సరం 2024-25 గానూ ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా విడుదల కాలేదంటే పాలకులకు విద్యావ్యవస్థ బలోపేతంపై శ్రద్ధ ఎలాఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ పాఠశాలల్లో అద్భుతాలు సృష్టిస్తామని ఊరించిన ప్రభుత్వాలు.., నిధుల విడుదలలో ఉసూరుమనిపిస్తున్నాయని ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పాఠశాలల ఎంపిక విధానం..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ ఏడాది నమోదుచేసే యూడైస్ ఫార్మెట్ ప్రకారం 100 మార్కులకు గానూ గ్రామీణ పాఠశాలల్లో 60 మార్కులు, పట్టణ పాఠశాలల్లో 70 మార్కులు సాధిస్తే ఆ పాఠశాలలు పీఎం శ్రీ యోజన పథకానికి ఎంపిక చేస్తారు. ఈ మార్కుల ప్రకారమే 2023-24 విద్యాసంవత్సరానికి గానూ గద్వాల జిల్లాలో - 12, మహబూబ్‌నగర్ జిల్లాలో - 17, నాగర్‌కర్నూలు జిల్లాలో - 17, నారాయణపేట జిల్లాలో - 12, వనపర్తి జిల్లాలో - 11 చొప్పున మొత్తం 69 పాఠశాలలు ఎంపిక చేశారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 పాఠశాలలు ఎంపిక చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 10 పాఠశాలలు, మ హబూబ్‌నగర్ జిల్లాలో 9, నాగర్‌కర్నూల్ జిల్లా లో 10, నారాయణపేట జిల్లాలో 7, వనపర్తి జిల్లాలో 10 పాఠశాలలు ఎంపిక చేశారు.

ఒక్కో పాఠశాలకు రూ. 40 లక్షలు

పీఎం శ్రీ యోజన పథకానికి ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలకు ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ. 40 లక్షల నిధులు విడుదల చేయాలి. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో అధునాతన ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, వృత్తివిద్యా కోర్సులు, ఇంటర్‌నెట్ సౌకర్యం, కేరీర్ గైడెన్స్, క్రీడాసామాగ్రి కొనుగోలు చేయటం, సౌరవిద్యుత్ ప్యానల్ ఏర్పాటు, పాఠశాల ఆవరణలో పోషకాహార తోటల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించాలి. ఎంపికైన ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ పాఠశాలకు పెద్ద ఎత్తున ప్రభుత్వం నిధులు విడుదల చేయటం వల్ల ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన అందుతుందని భావించి తీరా నిధులు రాక నిరాశచెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ. 18.40 కోట్లు పెండింగ్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పీఎం శ్రీ యోజన కింద జోగుళాంబ గద్వాలకు రూ.4 కోట్లు, మహబూబ్‌నగర్‌కు రూ.3,60 కోట్లు, నాగర్‌కర్నూలుకు రూ.4 కోట్లు, నారాయణపేటకు రూ. 2.80 కోట్లు, వనపర్తికి రూ. 4 కోట్ల వరకు పీఎంశ్రీ పథకం నిధులు విడుదల కావలసి ఉంది.


పీఎం శ్రీ యోజన పథకానికి ఎంపికైన కేటీదొడ్డి మండలం, కుచినెర్ల జిల్లా పరిషత్ పాఠశాల

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలో పీఎం శ్రీ యోజన పథకం కింద 2024-25 విద్యాసంవత్సరానికి ఎంపికైన పాఠశాలలకు ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. గతేడాది కూడా నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం.

- శాంతిరాజు, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి, గద్వాల


జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో పేరుకు పోయిన మట్టి (ఫైల్)

జూరాలలో తగ్గుతున్న
నీటి సామర్థ్యం

- ప్రాజెక్టులో పేరుకుపోతున్న పూడిక
- పట్టించుకోని పాలకులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు


జూరాల ప్రాజెక్టు ముందు భాగంలో తేలిన రాళ్లు (ఫైల్)

ఉమ్మడి జిల్లా వరప్రదాయినిగా పిలువబడే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో పూడిక పేరుకుపోతోంది. దీంతో ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. భవిష్యత్‌లో నీటి కష్టాలు ఏర్పడే ప్రమాదం పొంచిఉన్నది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 30 ఏళ్లు దాటినా నేటికి ఒక్కసారి కూడా పూడిక తీయకపోవడం గమనార్హం. ఎగువ నుంచి భారీస్థాయిలో బురద, రాళ్లు, మట్టి తదితర వ్యర్థాలు వరద నీటిలో కొట్టుకొచ్చి ప్రాజెక్టులో పేరుకుపోతున్నాయి. అధికారుల లెక్క ప్రకారం జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 11.46 టీఎంసీలు, ప్రస్తుతం 2.50 నుంచి 3 టీఎంసీల మేరకు ప్రాజెక్టులో పూడిక పేరుకుపోయిందని చెప్పవచ్చు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ ఏడాదైనా పూడిక తీసే పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- అమరచింత, ఆంధ్రజ్యోతి

6

ఇంటికో అంజన్న


- ఆ ఊరంతా హనుమాన్ భక్తులే
- ఎక్కువ మందికి హనుమంతుడి పేరు..
- ఆవుపేడ పిడకలతో స్వామి వారికి దీపారాధన
- 2008 వరకు ఆకుల పందిరి కిందే పూజలు
- పరిశుద్ధానందగిరి స్వామి సూచనతో గుడి నిర్మాణం


గాధిర్యాల్ గేట్ వద్ద దాతల సాయంతో నిర్మించిన ముఖద్వారం

7

మోసగాళ్లు

- రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 6.40 లక్షలు స్వాహా
- నిరుద్యోగుల నుంచి రూ.లక్షల వసూళ్లు..



7

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ బాలికల జూనియర్ జట్టు ఎంపిక

7

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు
- ఉత్సాహంగా అంతర్రాష్ట్ర కరాటే పోటీలు

7


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష

- తొలిరోజు గద్వాల జిల్లాలో 55.83 శాతం అభ్యర్థులు హాజరు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 54 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీలు

గద్వాలటౌన్/వనపర్తి క్రైం/నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించిన గ్రూప్-3 తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉదయం సెషన్‌లో నిర్వహించిన పేపర్-1 జనరల్ స్టడీస్- జనరల్ ఎబిలిటీస్ పరీక్షకు జిల్లాలోని 25 కేంద్రాల్లో 8,570 మందికి గాను 4,789 మంది (55.88 శాతం) హాజరయ్యారు. మిగతా 3781 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా మధ్యాహ్నం పేపర్-2 హిస్టరీ పొలిటికల్ సైన్స్ అండ్ సోసైటీ పరీక్షకు జిల్లాలోని 25 కేంద్రాల్లో 8,570 మందికి గాను 4,785 మంది (55.83 శాతం) హాజరయ్యారు. 3,785 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్, ఎస్‌వీఎం డిగ్రీ కళాశాల తదితర కేంద్రాలను కలెక్టర్ బీఎం.సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావులు పరిశీలించారు. గద్వాల పట్టణంలోని దయానంద విద్యామందిర్ పరీక్ష కేంద్రంలో సర్వీస్ కమిషన్ పరీక్ష రాస్తున్న అభ్యర్థి ఒకరు సాయంత్రం పరీక్ష ముగిసేముందు మూర్ఛ వచ్చి పడిపోయినట్లు అధికారులు తెలిపారు. అప్రమత్తమైన అధికారులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన 31 పరీక్ష కేంద్రాలలో పేపర్-1 పరీక్షకు 8,312 మంది అభ్యర్థులకు గాను 4,612 మంది హాజరయ్యారు. పేపర్-2 పరీక్షకు 8,312 మంది అభ్యర్థులకు గాను 4,611 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరీక్షల కేంద్రాల వద్ద చీఫ్ సూపరింటెండెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్ష ముగిసిన వెంటనే పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రూప్-3 పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 9,478 మంది అభ్యర్థులకు గాను 54 శాతం మంది హాజరైనట్లు జిల్లా కన్వీనర్ మధుసూదన్‌శర్మ తెలిపారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


వనపర్తి పట్టణంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి



నాగర్‌కర్నూల్ పట్టణంలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


గద్వాల ప్రభుత్వ అభ్యసన పాఠశాలలో పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్


వనపర్తి పట్టణంలో పరీక్ష కేంద్రంలోకి పరుగులు తీస్తున్న అభ్యర్థులు


గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

భక్తి శ్రద్ధలతో మైసమ్మ పూజలు

పెద్దకొత్తపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగు బంగారంగా వెలిసిన మైసమ్మ దేవతకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నలుమూలల నుంచి ఈ ఆదివారం దాదాపు 15వేల మంది భక్తులు మైసమ్మ తల్లిని దర్శనం చేసుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తుల నుంచి ఆదివారం టికెట్ల ద్వారా రూ.31,590, హుండీ ద్వారా రూ. 61,610 మొత్తం రూ. 93,200 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.


మైసమ్మ దేవతను దర్శనం చేసుకుంటున్న భక్తులు

నేటి ప్రజావాణి రద్దు : కలెక్టర్

గద్వాల న్యూటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్షలు కొనసాగుతున్నందున సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులందరూ గ్రూప్-3 పరీక్షల నిర్వహణలో ఉంటారని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చి అసౌకర్యానికి గురికావద్దని కలెక్టర్ తెలిపారు.

ఐజీ సుమతికి పితృ వియోగం

● కలుగొట్లలో విషాదం ● అంత్యక్రియలకు రానున్న ఇంటెలిజెన్స్ డీజీపీ



తండ్రి భౌతికకాయం వద్ద విషణ్ణ వదనంతో ఐజీ సుమతి

అలంపూర్ చౌరస్తా, నవంబరు 17, (ఆంధ్ర జ్యోతి) : తెలంగాణ ఇంటిలిజెన్స్ ఐజీ బడుగుల సుమతి ఇంట విషాదం నెలకొంది. ఆమె తండ్రి తిరుపతిరెడ్డి (74) వయోభారంతో ఆదివారం తెల్లవారుజామున హైదరాబాదులోని తన నివాసంలో మృతి చెందారు. దీంతో అయన స్వగ్రామమైన జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, కలుగొట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తిరుపతిరెడ్డి గతంలో కలుగొట్ల గ్రామానికి రెండు పర్యాయాలు సర్పంచుగా, జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం నిర్వహించనున్న అంత్యక్రియలకు ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి రానున్నట్లు తిరుపతిరెడ్డి కుమారుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. అయనకు అయిదు గురు సంతానం కాగా, మూడవ సంతానమైన సుమతి అంచెలంచెలుగా ఎదిగి నేడు ఐజీ స్థాయిలో ఉన్నారు. నాన్నకు తానంటే అమితమైన ప్రేమ అని, శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా ఆయన అశీస్సులు కూడా తీసుకున్నానని సుమతి అవేదనతో తెలిపారు.

పూర్వ వైభవం వచ్చేనా?



శిథిలావస్థలో మైలారం శివాలయం



చెట్ల పొదల్లో శివలింగం

● శిథిలావస్థలో పలు ఆలయాలు
● ధూపదీప నైవేద్యాలు కరువు

బల్మూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు భక్తిశ్రద్ధలతో దేదీప్యమానంగా వెలిగిన దేవాలయాలు నేడు దీనావస్థలో దర్శనమిస్తున్నాయి. మండలంలోని పురాతన దేవాలయాలు శిథిలమవుతున్నాయి. మండలంలో ఎక్కువగా నవాబులు, రాజులు, కాకతీయుల కాలం నాటి శివాలయాలు ఉన్నాయి. మైలారం, కొండనాగుల చెన్నకేవవస్వామి ఆలయాలు ఆలనపాలన చూసే వారు లేక శిథిలంగా మారుతున్నాయి. బాణాల, బిల్లకల్, గోదల్ గ్రామాలలో శివాలయాలు ఉన్నాయి. మైలారం శివాలయాన్ని (వీరన్నపల్లి)కి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నెర్రెలు వచ్చి కుంగిపోయింది. పక్కనే ఉన్న చాముండేశ్వరీ, చెన్నకేశవ దేవతా మూర్తుల విగ్రహాల గుప్త నిధుల కోసం గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. గుళ్లను బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రూప్ 3 సందడి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం గ్రూప్ 3 పరీక్షను నేపథ్యంలో జిల్లా కేంద్రాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే అన్ని కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పోలీసులు అన్ని కేంద్రాలను పకడ్బందీగా తనిఖీ చేశారు. సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు కేంద్రాలకు పరుగులు పెట్టారు. సమయం గడిచిపోయాక వచ్చిన వారిని అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. పలువురు అభ్యర్థుల చిన్నారులను ఆడించేందుకు కుటుంబ సభ్యులు పాట్లు పడ్డారు.

-ఆంధ్రజ్యోతి , నెట్‌వర్క్



నారాయణపేటలో కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



వనపర్తిలో చిన్నారికి ఊయల కట్టి ఆడిస్తున్న మహిళ



మహబూబ్‌నగర్‌లో హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి



మహబూబ్‌నగర్‌లో ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద నిలిపిన అభ్యర్థుల వాహనాలు



వనపర్తిలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు





మహబూబ్‌నగర్‌లో పరీక్షకు వస్తున్న వికలాంగుడు, నారాయణపేటలో ఓ కేంద్రం వద్ద పోలీసుల పహారా



హాల్ టికెట్ నంబరు చూసుకునేందుకు వనపర్తిలో వికలాంగురాలికి సాయం చేస్తున్న కానిస్టేబుల్





నారాయణపేట, వనపర్తిలలో చిన్నారులను ఆడిస్తున్న మహిళలు



మహబూబ్‌నగర్‌లో చిన్నారితో పరీక్షకు వచ్చిన అభ్యర్థిని





వనపర్తిలో సమయం గడిచిపోవడంతో అనుమతించని అభ్యర్థులు

చర్మ వ్యాధులతో పీటీజీ విద్యార్థుల అవస్థలు



ముఖానికి దద్దుర్లు వచ్చిన విద్యార్థి ధనుష్

మన్ననూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు ఆదివాసీ గురుకుల విద్యాలయం (పీటీజీ)లో చర్మ సంబంధ వ్యాధులు సోకి చెంచు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పీటీజీ గురుకులంలో 350 మంది విద్యార్థులుండగా 50 మందికి పైగా విద్యార్థులకు గజ్జి, తామర వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నా గురుకులం నిర్వాహకులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రైయివేటుగా మందుల కేటాయింపు ఉండేదని, ప్రస్తుతం విద్యార్థులకు తామే తీసుకుకెళ్లి వైద్యం అందించే పరిస్థితి దాపురించిం దన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం లేదని విద్యార్థులు ముక్తేష్, బాందన్, ధనుష్‌లు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ గోవర్ధన్ మాట్లాడు తూ విద్యార్థులు చర్మవ్యాధులకు గురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోపాల్‌పేట, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని చోటుచేసుకుంది. మృతుడు సోదరుడు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని కిష్టగిరి తండాకు చెందిన ముడావత్ పీర్యానాయక్, మౌని దంపతుల చిన్న కుమారుడు ముడావత్ కిషోర్ (23)కు మూడు సంవత్సరాల కిందట మండలంలోని బుద్దారం గ్రామ పరిధిలోని జాంప్లా తండాకు చెందిన సరితతో వివాహమైంది. వీరికి ప్రస్తుతం ఒక సంవత్సరం కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య చిన్నచిన్నగొడవలు చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు పెద్దలతో పంచాయితీ పెట్టినా.. మళ్లీ గొడువ పడుతూనే ఉన్నారు. దీంతో సరిత జాంప్లాతండాలో తల్లి వారి ఇంటి వద్ద ఉంటుంది. కిషోర్ హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ ఉంటున్నాడు.

శనివారం మధ్యాహ్నం సమయంలో కిషోర్ హైదరాబాద్ నుంచి కుమారుడిని చూసేందుకు వచ్చాడు. అనంతరం బుద్దారం గ్రామంలోకి బైక్ పై వచ్చి జాంప్లా తండాకు తిరుగు ప్రయాణంలో బుద్దారం రైస్‌మిల్లు సమీపంలో కిషోర్ బైక్‌పై అతి వేగంతో వచ్చి రోడ్డు పక్కకు దుసుకెళ్లి పక్కనే ఉన్న స్తంభానికి బలంగా ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమవడంతో గ్రామస్థులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. గాయాలతో పడి ఉన్న కిషోర్‌ను వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని కిషోర్ స్వగ్రామానికి తరలించారు.

జూరాలలో తగ్గుతున్న నీటి సామర్థ్యం

● ప్రాజెక్టులో పేరుకుపోతున్న పూడిక



జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

అమరచింత, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని అత్యధిక ప్రాంతాలకు తాగు, సాగు నీటిని అందించే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతోంది. ఈ ప్రాజెక్టు నిర్మించి 30 ఏళ్లు దాటినా పూడిక తీతకు నోచుకోలేదు. నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తుండడంతో భవిష్యత్‌లో ఆందోళనకర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. కృష్ణానదిపై ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి ప్రాజెక్టు అయిన జూరాలపై ప్రజాప్రతినిధులు ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జూరాల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 30 ఏళ్లు దాటినా నేటికి ఒక్కసారి కూడా పూడిక తీయలేదు. ఎగువ నుంచి భారీస్థాయిలో బురద, రాళ్లు, మట్టి తదితర వ్యర్థాలు వరద నీటిలో కొట్టుకొచ్చి ప్రాజెక్టులో పేరుకుపోతున్నాయి. అధికారుల లెక్క ప్రకారం జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 11.46 టీఎంసీలు, ప్రస్తుతం 2.50 నుంచి 3 టీఎంసీల మేరకు ప్రాజెక్టులో పూడిక పేరుకుపోయిందని చెప్పవచ్చు.

జఠిలమైన పూడిక సమస్య..

జూరాల ప్రాజెక్టు పూడిక సమస్య జఠిలంగా మారుతోంది. వర్షాభావ పరిస్థితి ఏర్పడినప్పుడు జూరాల ప్రాజెక్టుపై ఆధారపడితే నిల్వ నీటి సామర్థ్యం తగ్గుతూ వస్తుండడంతో నీటి సమస్య పొంచి ఉంటుందని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ నియోజక వర్గాలకు తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారానే సరఫరా చేస్తున్నారు. అయినా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికపై దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రాజెక్టులో నీటి నిల్వ శాతం కన్నా పూడిక శాతం ఎక్కువ కనిపిస్తుంది. 2013-14 సంవత్సరంలో ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా ప్రాజెక్టు నీటిని ఖాళీ చేయించారు. అప్పుడే పూడిక సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక యంత్రంతో ద్వారా పూడికను తొలగించి ఉంటే ప్రస్తుతం ఈ సమస్య ఇంత జఠిలం అయ్యేది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై జూరాల ప్రాజెక్టు ఈఈ జుబేర్ అహ్మద్‌ను వివరణ కోరగా ప్రాజెక్టులో మూడు టీఎంసీల మేరకు పూడిక ఉన్న విషయం వాస్తవమే. ఈ విషయంపై ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

క్రస్టు గేట్లు మూసినందుకే పూడిక శాపం

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్లను మూసివేశారు. 50 శాతం జూరాల ప్రాజెక్టు పూడిక క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పోతుందని, ఆంధ్రలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఇబ్బంది అవుతుందనే కుట్రతో జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్లను మూయించేశారు. అందుకే జూరాలలో మూడు టీఎంసీల మేరకు పూడిక చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పూడికతీతపై దృష్టి సారించాలి.

- మోదీ మనోహర్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు, అమరచింత

తక్షణమే పూడిక తొలగించాలి

ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి నేటి వరకు పూడిక తొలగించక పోవడం విచారకరం. ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన జూరాల ప్రాజెక్టుకు పాలకులు ప్రత్యేక నిధులు కేటాయించి పూడికను తక్షణం తొలగించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి సారించాలి.

- హన్మంతు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, నందిమల్ల

భగవంతుడిని తెలుసుకోవడమే జ్ఞానం

● శ్రీపీఠం ఆశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతి స్వామి
● ముగిసిన శ్రీరుద్రసహిత శతచండీ యాగం
● ఘనంగా పూర్ణాహుతి, పాల్గొన్న పీఠాధిపతులు, ఎంపీ డికె అరుణ



మలయాళ లక్ష్మీనారాయణ ఆశ్రమంలో పూర్ణాహుతికి హాజరైన పాలమూరు ఎంపీ డీకే అరుణ

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భగవంతుడిని తెలుసుకోవడమంటేనే జ్ఞానాన్ని పొందడమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతిస్వామి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం మలయాళ లక్ష్మీనారాయణ ఆశ్రమంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీరుద్రసహిత శతచండీ యాగం ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రవచనాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ పంచభూతాలైన అగ్ని, జలం, వాయువు, భూమి, ఆకాశాలను సంరక్షణ చేస్తూ లోక కల్యాణానికి ఉపయోగపడే రీతిగా మానవులంతా కృతజ్ఞత చూపాలని సూచించారు. పంచభూతాలను సంరక్షిస్తే సర్వజీవుల రక్షణ జరుగుతుందన్నారు. ఆశ్రమ 20వ వార్షికోత్సవం కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శతచండీ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉదయం గీతాపారాయణం, శివ పార్వతుల కల్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాలమూరు ఎంపీ డీకే అరుణ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానంద గిరిస్వామి, ఆశ్రమం పీఠాధిపతి పరమాత్మనందగిరి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

-హుటాహుటిన హైదరాబాద్ ఆసుపత్రికి తరలింపు

అచ్చంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో చిన్నారికి గాయాలైన సంఘటన ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని టంగాపూర్ కాలనీలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన రవి కుమారుడు కాలనీలో అడుకుంటుండగా వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని వెంటనే ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. కుక్కలు దాడిచేయడంతో చిన్నారికి తలపై తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం అందించిన డాక్టర్లు తలకు తీవ్ర గాయాలు కావడంతో చిన్నారికి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబసభ్యులు హుటాహుటిన హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి చిన్నారికి వైద్యం అందించారు. ప్రస్తుతం చిన్నారి ఆర్యోగం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.



కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడు

క్రైం కార్నర్

రైలు ఢీకొని పంచాయతీ కార్మికుడి మృతి

నర్వ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద జరిగింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నర్వ మండల కేంద్రానికి చెందిన నర్సింహులు(45) గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జాతరకు అని శుక్రవారం గ్రామ పంచాయతీలో సెలవు తీసుకుని కురుమూర్తికి వెళ్లాడు. అక్కడి నుంచి దేవరకద్ర మీదుగా నర్వకు వద్దామని బస్టాండులో దిగి అక్కడ రైలు పట్టాలపై బహిర్భూమికి వెళ్లిన క్రమంలో రైలు ఢీకొట్టడంతో అక్కడికి అక్కడే పడి మృతి చెందాడని మృతుడి బామ్మర్ది రవి తెలిపారు. పంచనామా కోసం పోలీసులు శవాన్ని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్.. మహిళ మృతి


జిలుగపెల్లి నిరంజనమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్ చేస్తూ ఓ నిండు ప్రాణం బలిగొన్నారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ బస్టాండ్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన జిలుగపల్లి నిరంజనమ్మ (56)తన పుట్టింటికి ముష్టిపల్లి గ్రామానికి శనివారం వెళ్లింది. తిరిగి ఆదివారం స్వగ్రామానికి ప్రయాణమై ముష్టిపల్లి స్టేజీ వద్ద బస్సు ఎక్కి కల్వకోల్ వద్ద బస్సు దిగింది. అక్కడి నుంచి ఆమె స్వగ్రామం కుడికిళ్లకు రోడ్డు పక్క నుంచి కాలి నడకన వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కారు అతి వేగంగా కొల్లాపూర్ వైపు వెళ్తూ వెనుక నుంచి ఆమెను ఢీకొట్టింది. దీంతో కారు వేగానికి ఆమె ఎగిరిపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

అయితే సదరు కారులో ప్రయాణించిన వారిలో ఇద్దరు యువతులు, మరో ఇద్దరిలో ఒకరు ప్రొఫెసర్, మరొకరు అడ్వకేట్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి కుటుంబీకులు సంఘటన చోటే శవంతో టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆందోళన శిబిరానికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఏఎస్ఐ బాలనారాయణకు సూచించారు. మధ్యాహ్నం తరువాత పోస్టుమార్టం కోసం శవాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి

మానవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని జల్లాపురం గ్రామానికి చెందిన గొల్ల రాముడు తండ్రి రోషన్న వీరికి 1500 వందల గొర్రెల మంద జీవాలు ఉన్నాయి. వీటిలో చిన్న, సన్న పిల్లలు 300 వందల దాకా ఉంటాయి. ఈ మందను ఓ రైతు పొలంలో ఆపారు. వీటి మేత కోసం కాపరి మరో పొలం దగ్గరకు వెళ్లడంతో ఎటునుంచి వచ్చాయో తెలియదు కానీ రెండు కుక్కలు కంచె లోపలికి వెళ్లాయి. మొదటగా చిక్కిన గొర్రె పిల్లను సగం తిని వదిలి పెట్టాయి. మిగతా వాటిలో 29 గొర్రెలను గాయపరిచి చంపేశాయి. పొలం గట్టు వెంబడి అటుగా వస్తున్న ఓ రైతుకు గొర్రె పిల్లల అరుపు వినపడటంతో వెంటనే గొర్రెల కాపరికి తెలిపాడు. హడావుడిగా వచ్చి కుక్కలను తరిమి కొట్టి చంపేశాడు. రూ. లక్షా యాభై వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వపరంగా మమ్మల్ని ఆదుకోవాలని గొర్రెల కాపరి కలెక్టర్‌ను కోరారు.

భూమి వారిదని వేధిస్తున్నారు...

- పోలీసులను ఆశ్రయించిన మహిళ

నవాబ్‌పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చౌడూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 340, 341లోని 12 ఎకరాల 17 గుంటల భూమి వారిదని ఇటీవల నవాబ్‌పేటకు చెందిన కొంతమంది తమను వేధిస్తున్నారని విద్యావతి అనే మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాము కొంత కాలంగా హైదరాబాద్‌లో జీవిస్తూ ఇటీవల తమ పొలానికి కొత్తగా కంచె వేయగా, కొందరు వ్యక్తులు అడ్డువచ్చి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. 1954 నుంచి ఈ భూమిపై తమ కుటుంబ సభ్యులే మోఖపై ఉన్నారని.. సర్వే సమయంలో తమకు అనుకూలంగా పొలం చుట్టూ కడీలు పాతించారని అన్నారు. ఈ విషయంపై నవాబ్‌పేట ఎస్ఐ విక్రంను వివరణ కోరగా పూర్తి వివరాలు తెలుసుకుని తహసీల్దార్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


రాముడు(ఫైల్)

పాన్‌గల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని కదిరేపాడు గ్రామానికి చెందిన చొప్పరి రాముడు(36) మనస్తాపానికి గురై ఆదివారం ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాముడు గ్రామంలోని మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి మనస్తాపానికి గురై, మామిడి తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటికో అంజన్న


స్వామి వారి దేవాలయం



● ఆ ఊరంతా హనుమాన్ భక్తులే

- ఎక్కువ మందికి హనుమంతుడి పేరు..
- ఆవుపేడ పిడకలతో స్వామి వారికి దీపారాధన
- 2008 వరకు ఆకుల పందిరి కిందే పూజలు
- పరిశుద్ధానందగిరి స్వామి సూచనతో రూ. 50 లక్షలతో గుడి నిర్మాణం


స్వామి మూలవిరాట్టు

ఆ గ్రామంలో దాదాపు ప్రతీ ఇంట్లోనూ ఒక్కరికైనా ఆంజనేయ స్వామిని నిత్యం తలుచుకునేలా గ్రామంలో ఏ ఇంటిని తట్టినా హన్మంతు, అంజిలయ్య, మారుతి, అంజిలమ్మ, హనుమమ్మ, సంజీవ పేర్లతో పిలవబడుతున్నారు. స్వామి వారిని నిత్యం స్మరించేలా పేరు పెట్టుకున్నట్లు ఆ గ్రామంలో ఎవరిని అడిగిన చెపుతారు. గ్రామంలో ప్రజల్లో దాదాపు 50 శాతం వరకు హనుమాన్ పేరు వచ్చేవిధంగా పెట్టుకోవడం గమనార్హం.

మహమ్మదాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలో వందల ఏళ్ల క్రితం కొలువుదీరిన వీరహనుమాన్ భక్తుల పాలిట కొంగుబంగారంగా.. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పూజలందుకొంటున్నారు. ప్రతీ శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శనివారం వచ్చిందంటే చాలు ఆ గ్రామంలోని వీర హనుమాన్ దేవాలయం భక్తులతో కిటకిట లాడుతుంది. శ్రావణ మాసం వచ్చిందంటే ఆ ఊరిలో ఏ ఒక్క ఇంట్లో మందు, మాంసాహారం ముట్టరు. ప్రతీ ఇంట్లో స్వామి పేర తప్పనిసరి పూజలు చేసుకుంటారు. శ్రావణ శనివారాల్లో రామభక్త ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. తమ మొక్కులు తీరిన భక్తులు గండజ్యోతులు సమర్పించి స్వామి వారికి ప్రత్యేక భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఆవుపేడ పిడకలతో స్వామి వారికి దీపారాధన చేస్తారు. కార్తీక మాసం అయితే స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పండివంటకాలు నైవేద్యంగా సమర్పిస్తారు.

● స్వామి వారి చరిత్ర..

పూర్వకాలంలో విశ్వామిత్ర మహర్షి ముని మనమడైన గాధినందనుడనే మహర్షి ఇక్కడ తపస్సు చేశారని, ఆ సమయంలోనే ఇక్కడ వీరాంజనేయస్వామి విగ్రహం స్థాపించారని చరిత్ర చెబుతుంది. అదే సమయంలో ఆంజనేయస్వామి విగ్రహం ముందే సుమారు 45 అడుగుల ఎత్తున దివ్యమైన భారీ దీపస్తంభాన్ని ప్రతిష్ఠించారని ప్రజలు కథలుగా చెప్పుకుంటారు. ఈ క్రమంలోని మహర్షి గాధినందనుడి పేరు మీదనే గ్రామానికి గాధిర్యాల్ పేరు వచ్చిందని గ్రామంలోని పెద్దలు చెపుతున్నారు. ఎంతో మహిమగల వీరాంజనేయ స్వామి దర్శనం కోసం ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన భక్తులతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు శ్రావణ, కార్తీక మాసాలతోపాటు, ఉగాది, సంకాంత్రి, హనుమాన్ జయంతి పండుగలకు పెద్ద ఎత్తున వచ్చి స్వామి వారికి కోడెదూడలు సమర్పిస్తారు, వెండి ఆభరణాలు, నగదు రూపేనా హుండీలో సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ స్వామికి గంటల దేవుడని ప్రతీతి.

● ఆంజనేయస్వామి అంటే చాలాభక్తి



ఆంజనేయ స్వామి అంటే నాకు ఎంతో భక్తి. గాధిర్యాల్ గ్రామంలో స్వామి వారు పిలిస్తే పలికే దేవుడు. ప్రతీ ఇంట్లో స్వామి వారి పేరు ఒక్కరికైనా ఉంటుంది. ఈ స్వామి వారి పేరుతో పిలిస్తే చాలు అనుకున్న పని జరుగుతుందని గ్రామస్థులకు సమ్మకం. శ్రావణం, కార్తీక మాసాల్లో, ఉగాది, సంక్రాంతి, హనుమాన్ జయంతి, దీపావళి అయితే మరింత కనుల పండువగా ఉంటుంది.

- అంజనాచారీ , ఆలయ కమిటీ చైర్మన్

●2008 వరకు గుడి లేదు

గత వందల ఏళ్లుగా స్వామి వారికి గుడి లేదు. పచ్చటి ఆకుల పందిరి కిందే స్వామి వారికి పూజలు చేసే వారు. అసలు స్వామికి గుడి కట్టవద్దు అని పెద్దలు చెపుతుండేవారు. గుడి కట్టినా నదుల నుంచి నీరు, పుణ్యస్థలాల నుంచి మట్టి తీసుకువచ్చి గుడి నిర్మాణానికి ప్రారంభించాలని ప్రచారం జరుగుతుండేది. దీంతో గుడి కట్టకుండా ఆకుల పందిరి కిందే పూజలు చేయాలని చెప్పేవారు. 2008లో పరుశుద్ధనందగిరి స్వామిజీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శనకు వచ్చారు. ఆ సమయంలో ఆంజనేయ స్వామికి గుడినిర్మాణం చేపట్టాలని గ్రామస్థులకు సూచించడంతో గుడి నిర్మాణానికి అదే ఏడాదిలో తొలి అడుగు పడింది. వీరహనుమాన్ విగ్రహాన్ని విశ్వామిత్రుని మునిమనవడు గాధినందనుడు ప్రతిష్ఠించారని మూల విరాట్టును కదిలించకుండా గుడి నిర్మించాలని చూచించారు. దీంతో 2008 ఏడాదిలోనే గుడినిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి భాగస్వామం ఉండే విధంగా భారీ మొత్తంలో నిధులు పోగుచేశారు. అవేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు నిధులు ఇచ్చారు. ఈ గుడి పనులు 2017 వరకు సాగాయి. గుడి నిర్మాణానికి అప్పట్లో రూ. యాభై లక్షల వరకు ఖర్చు చేశారు. 2017 మేలో హనుమాన్ జయంతి సందర్భంగా పరిశుద్ధానందగిరి స్వామిజీ ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో స్వామి గుడిని ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా మే, జూన్ నెలల్లో వచ్చే హనుమాన్ జయంతికి స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2021లో రూ.30 లక్షల ఖర్చుతో రోజ్‌వుడ్, టేకుతో రథం తయారు చేయించారు.

● ప్రతీ ఇంట్లో ఆంజనేయస్వామి పేరు తప్పనిసరి



ప్రతీ ఒక్కరికి గ్రామంలో ఇంటి దేవుడు వీరాంజనేయ స్వామి. అందుకు ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరికైనా స్వామి వారి పేరు పెట్టుకున్నారు. హనుమమ్మ, హనుమయ్య, అంజిలమ్మ, అంజిలయ్య అంటూ నిత్యం స్వామి వారి పేరు తలుచుకుంటారు. వీరాంజనేయ స్వామి అంటే ఎంతో మహిమగల దేవుడు. మా తాతాలు, ముత్తాతలకాలం నాటి నుంచి ఈ పేర్లు వస్తున్నాయి.

- సందళ్ల అంజిలమ్మ, మాజీ సర్పంచ్, గాధిర్యాల్

కార్తీక మాసం ప్రత్యేకం

కార్తీక మాసం వచ్చిందంటే చాలు ప్రతీ ఇంట్లో పండుగలు నిర్వహిస్తారు. స్వామి వారికి ప్రతి రోజూ అభిషేకం చేసి, వారి ఇళ్లలో భజన, భక్తులకు బోజనం పెట్టిస్తారు. రాత్రి భక్తులచే భజనలు చేయించి ఇంటి నుంచి స్వామి వారి దేవాలయం వరకు నడుచుకుంటూ వెళ్లి ఇంట్లో తయారు చేసుకున్న గంట ఆకారంలో రూపొందించిన బంతి పూల గంటనే వీర హనుమాన్ దేవాలయంలో కడతారు. దాంతో కార్తీక మాసం మొత్తం రాత్రి సమయంలో స్వామి వారి దేవాలయం భజనలతో తెల్లవారుజాము వరకు పండగ వాతావరణం ఉంటుంది.


స్వామి ఊరేగింపు కోసం చేయించిన రథం

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు
- ఉత్సాహంగా అంతర్రాష్ట్ర కరాటే పోటీలు


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించారు. పోటీలను డీఎస్పీ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరూ ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కరాటే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. టోర్నీ ఆయా విభాగాల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌ను గీతాశ్రీ కైవసం చేసుకొంది. విజేతలకు ఎస్ఎస్ఎస్‌వోఐ ఇండియా చీఫ్ డైరెక్టర్ రవీందర్‌కుమార్ వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, టోర్నీ ఆర్గనైజర్ రవినాయక్, ఆర్‌కే స్పోర్ట్స్ బుడోకాన్ ఫౌండర్ రవికుమార్, సలహాదారుడు విజయ్‌కుమార్, కరాటే సీనియర్ మాస్టర్లు శంకర్‌నాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.


కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ బాలికల జూనియర్ జట్టు ఎంపిక


జడ్చర్లలో హ్యాండ్‌బాల్ బాలికల జూనియర్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జడ్చర్లలోని మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జూనియర్ జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నెల 29నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలోని కల్లాడి గ్రామంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే 46వ అంతర్‌జిల్లాల పోటీలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేశారు. 16మంది క్రీడాకారులు భార్గవి, శివానీచంద్ర, భవానీ, మీనాక్షి, దీక్షిత, లావణ్య, బిందుప్రియ, నందిని, స్వన్ని, అనిత, మాధవి, అర్పిత, మహేక్, సౌమ్య, లోకేశ్వరీ, హిమబిందులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తఖియొద్దీన్, శంకర్‌నాయక్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులు షోయబ్, రోజ, అభిలాష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్లు!



- రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 6.40 లక్షలు స్వాహా
- నిరుద్యోగుల నుంచి రూ.లక్షల వసూళ్లు..
- జాబ్ పేరిట యువతులకు గాలం వేస్తున్న మరికొందరు

గద్వాలక్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హలో సార్.... నేను ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్నాను. మా శాఖలో కొన్ని ఖాళీలు ఉన్నాయి. మీకు ఉద్యోగాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. అయితే మా సార్ వాళ్లకు కొంత డబ్బులు ఇవ్వాలని నిరుద్యోగులను బురిడీ కొట్టిస్తున్న సంఘటనలు కోకొల్లలు. ప్రభుత్వ శాఖలో ఉద్యోగాల పేరుతో కొందరు కేటుగాళ్లు నిరుద్యోగులను బుట్టలే వేసుకుంటుండగా.. మరికొందరు ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతులను లొంగదీసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

మరికొందరు ఏకంగా ఉద్యోగాల పేరిట లక్షలకు లక్షలు వసూలు చేస్తూ తీరా ఉద్యోగాలు ఎప్పుడు ఇప్పిస్తారని గట్టిగా అడిగేసరికి చేతులెత్తేస్తున్న సంఘటనలు జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నాయి.

రూ. లక్షలు వసూలు చేస్తూ.... జల్సాలు

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని వారినుంచి లక్షలు వసూలు చేస్తూ జల్సాలు చేస్తూ నిరుద్యోగులను అప్పుల పాలు చేస్తున్నారు. తమకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఆ కేటుగాళ్ల చెప్పేమాటలను నమ్మి తల్లిదండ్రులను ఒప్పించి వారి నుంచి అప్పులు తెప్పించి ఈ కేటుగాళ్లకు ఇస్తున్నారు. డబ్బులు పడిన వెంటనే ఇక నిరుద్యోగుల ఫోన్‌లకు సమాచారం రాకపోగా వారిఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేసుకుంటున్నారని బాధితులు తెలిపారు. కొందరు ఇక్కడి నిరుద్యోగులను మోసం చేసేందుకు హైదరాబాద్‌లో ఉన్న సెక్రటరేట్‌లో సైతం తమకు సంబంధించిన వారు ఉన్నారని, మీరిచ్చే డబ్బులు వారికి పంపితే వెంటనే ఉద్యోగాలు వస్తాయని నమ్మించి నిరుద్యోగులను ముంచేస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా నిరుద్యోగులలో ఆశలు మాత్రం చావక కేటుగాళ్ల వలకు చిక్కేస్తున్నారు.

● స్వచ్ఛంద సంస్థల పేరుతో కొందరు

జిల్లాలో కొందరు నాయకులు స్వచ్ఛంద సంస్థల పేరుతో చలామణి అవుతూ ప్రైవేట్ ఏజేన్సీలు ఉన్నాయని చెబుతూ మరి కొందరిని నమ్మించి వారినుంచి డబ్బులను వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో ఇలా వందల సంఖ్యలో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఈ వసూల్‌రాజాను పోలీసులు కేసును కూడా నమోదు చేశారు. అయినప్పటికీ ఆయన ఆగడాలకు అంతులేకుండా పోతున్నట్లు తెలుస్తున్నది.

మోసానికి గురైన కొన్ని సంఘటనలు

● గద్వాల జిల్లా కేంద్రంలోని మోమిన్‌మొహల్లా కాలనీకి చెందిన చాకలి నర్సింహ అనే వ్యక్తి నుంచి వనపర్తి జిల్లాకు చెందిన అంకిత, జగదీశ్వర్‌రెడ్డి అనే దంపతులు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.6.40 లక్షలు కాజేశారు. తీరా ఉద్యోగం ఇప్పించకపోవడంతో గత మూడు రోజుల క్రితం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

● అక్టోబరు నెలలో గద్వాల జిల్లాకేంద్రంలో వైద్యశాఖలో డ్రైవర్‌గా పనిచేసి వదిలేసిన యువరాజు అనే యువకుడు గద్వాల మండల పరిధిలోని ఓ నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.50వేలు, అలాగే వారి స్నేహితులకు కూడా ఇప్పిస్తానని మొత్తం రూ. 2.70 లక్షలను కాజేయడంతో అతనిని పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

● గద్వాల జిల్లా కేంద్రంలోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు గద్వాల మండల పరిధిలోని ఓ యువకుడికి కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ. మూడు లక్షలు కాజేశాడు. దీంతో ఆగస్టు నెలలో బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ రిమాండ్‌కు తరలించారు.

● సెప్టెంబరు 3న జిల్లా కేంద్రంలోని తెలుగుపేట కాలనీకి చెందిన టీజీ రాజు అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని ఆదే కాలనీకి చెందిన మహిళతో చనువు పెంచుకునేందుకు తరచుగా వాట్సాప్ కాల్స్, చాటింగ్ చేస్తూ ఆ మహిళకు ఉద్యోగం ఇప్పించకపోగా ఇబ్బందులకు గురిచేయడంతో ఆతనిపై పట్టణ పోలీసులు కేసును నమోదు చేశారు.

● అక్టోబరు 27న జిల్లా కేంద్రంలోని వైద్య శాఖలో ఏఎన్ఎం పోస్టులు ఇప్పిస్తానని పలువురు యువతులకు ఆంజనేయులు అనే అగంతకుడు ఫోన్ చేసినట్లు బాధితులు, వైద్యసిబ్బంది తెలిపారు. ఇందులో కొందరు యువతులు ఇది తెలియక అతనికి రూ. 25వేలు, రూ. 50 వేలు చెల్లించి ఫేక్ సర్టిఫికెట్స్ పొందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇలా ఎందరినో నిరుద్యోగులను ఉద్యోగాల పేరిట మోసాలు చేస్తున్న సంఘటనలుజిల్లాలో తారసపడుతున్నాయి.

ఉద్యోగాల పేరిట మోసపోవద్దు..



ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేస్తే సహించేది లేదని, వారిపై కేసులు నమోదు చేస్తాం. నిరుద్యోగ యువతీ, యువకులు వారి ఉద్యోగాల పేరిట డబ్బులు అడిగేవారి వివరాలపై పోలీసులకు సమాచారం ఇవ్వండి. ప్రతీ శాఖలో కూడా నేడు మెరిట్ ఆధారంగానే ఉద్యోగం వస్తుందన్న విషయం ప్రతీ నిరుద్యోగి గమనించాలి. డబ్బులు అడిగారంటే వారు మోసం చేసే వారనే విషయం గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- సత్యనారాయణ, డీఎస్పీ

టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా దూమర్ల


టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ ఎన్నికైన జిల్లా పీడీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫిజికల్ డైరెక్టర్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన పీడీ దూమర్ల నిరంజన్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో దూమర్లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సంయుక్త కార్యదర్శి నారాయణపేటకు చెందిన పీడీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పీడీ నిరంజన్‌యాదవ్‌కు రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు దక్కడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్వ్యూ..



పకడ్బందీగా కుల గణన సర్వే
- మురళి గౌడ్, తహసీల్దార్

శ్రీరంగాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తున్న కుల గణన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని తహసీల్దార్ మురళిగౌడ్ ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

మండలంలో కుల గణన సర్వే ఎలా కొనసాగుతుంది?

మండలంలో ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేసి సర్వేను ప్రారంభించాం. కుల గణన సర్వే విజయవంతంగా కొనసాగుతుంది.

సర్వేకు ప్రజలు సహకరిస్తున్నా?

సర్వేకు స్పందన బాగుంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాను.

మండలంలో ఎంత మందిని ఎన్యుమరేటర్లను ఏర్పాటు చేశారు.?

మండలంలో 36 మందిని నియమించాం. నాలుగు బ్లాగులుగా విభజించి నలుగురు సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నాం. ఒక్కొక్క బ్లాక్ కు 150 నుంచి 170 వరకు ఇళ్లను కేటాయించాం.

సర్వే చేసిన వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారా?

ప్రభుత్వం నుంచి ఆదేశం వచ్చిన వెంటనే ఆన్‌లైన్ చేస్తాం.

సర్వే ఎంత వరకు కొనసాగుతుంది?

కులగణన సర్వే ఈ నెల 24 వరకు పూర్తవుతుంది. సర్వేలో ఇబ్బందులు లేవు.

అవార్డుల కోసం దరఖాస్తులు

అమరచింత, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందజేసే లెజెండరీ, ప్రముఖులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్గనైజర్ డాక్టర్ సరోజనమ్మ కోరారు. ఆదివారం మాట్లాడారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని సామాజిక సేవలో పేరు గాంచిన వివిధ రంగాల ప్రముఖులకు అవార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే అవార్డుల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పురస్కారాల కోసం ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 6302908528 సంప్రదించాలని తెలియజేశారు.

బీసీల ఐక్యత సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఖిల్లాఘణపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే బీసీ ఐక్యత ఉమ్మడి పాలమూరు జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రజకుల మండల స్థాయి సమావేశంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్ దేవరకొండ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుల గణన సర్వే పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేసి చేతి వృత్తిదారులకు ఉపాధి మెరుగుపరచాలని తెలిపారు. కార్పొరేట్ కంపెనీల ఉత్పత్తులకు పోటీగా వృత్తిదారులు తట్టుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులాల అభ్యున్నతికి కార్పొరేషన్లు ఫెడరేషన్లు, పాలకవర్గాలను నియమించి తగిన బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించాలన్నారు. ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేలో సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో బీసీల స్థాయిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. చేతి వృత్తుల కులాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూతను అందించాలన్నారు. కార్యక్రమంలో బీసీ కుల నాయకులు రమేష్, మల్లేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం ఎంపిక



మాట్లాడుతున్న ఎర్రం రాములు

పాన్‌గల్, నవంబరు17, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జమ్మాపూర్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం గ్రామంలోని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థలం ఎంపిక చేసినట్లు అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎర్రం రాములు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కాలనీవాసులతో పాటు గ్రామస్థులు, ఉద్యోగస్థులు, వ్యాపారస్థులు, యువకులు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఎర్రం సిద్దయ్య, ఎర్రం ప్రశాంత్, ఎర్రం నాగేంద్రం, ఎర్రం మాధవ్, మల్లెపు రాజు, మల్లెపు గణేష్, మల్లెపు గోవిందు, మల్లెపు కురుమూర్తి, ఎర్రం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న రాచాల

పెబ్బేరు, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెలిమిల్లలో కుమార్ సోదరి వివాహం సందర్భంగా రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు రాచాల యుగందర్ గౌడ్ పాల్గొని వధువరులను ఆశీర్వదించారు.

రాఘవేంద్రగౌడ్, తాటికొండ కృష్ణయ్య, రమేష్‌గౌడ్, కృష్ణయ్య గౌడ్, నా గరాజు, వెంకటన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక దందా..

● అనుమతి ఒకటి .. తరలింపు మరొకరికి
● ఊకచెట్టు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలింపు



వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

పెబ్బేర్ రూరల్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపురం ఊకచెట్టు వాగు నుంచి ఆన్‌లైన్ అనుమతుల పేరుతో రోజు వారీగా ఇసుక దందా జోరుగా కొనసాగుతుంది. నిరంతరం ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లతో వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట మండలాలకు తరలిస్తూ... సొమ్మును పోగు చేసుకుంటున్నారు.

మొదటి ట్రిప్పు బుకింగ్‌తోనే కొనసాగింపు..

ఆన్‌లైన్‌లో కొత్త ఎత్తుగడతో ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్స్ 8 గంటలు, 10, 12, మధ్యాహ్నం 2 గంటల మధ్య సమయాల్లో ట్రాక్టర్లకు ఆన్‌లైన్ బుకింగ్స్ వస్తాయి. మొదటగా వచ్చిన బుకింగ్ సంక్షిప్త సమాచారంతో (మెసేజ్) ప్రకారం ట్రాక్టర్‌ను వాగు వద్దకు తీసుకెళ్తారు. ఇసుకను లోడ్ చేసుకుంటారు. ఇసుక లోడ్ అయిన ట్రాక్టర్‌ను రీచ్ అధికారి ఆ ట్రిప్పును ఇసుకను తరలిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆన్‌లైన్ పికప్‌తో వెళ్లిన ట్రాక్టర్ సంబంధిత వ్యక్తికి ఇసుకను తరలించకుండా అతనితో ఒప్పందం చేసుకొని అధిక ధర ఇచ్చే వారికి విక్రయించుకుంటారు. తర్వాత ట్రిప్పుకు ఆన్‌లైన్ క్లోజ్ చేయాలి. అలా చేయకుండా ఆ ట్రిప్పును అలాగే పీక్‌లో ఉంచి, మళ్లీ వాగు వద్దకు ట్రాక్టర్‌ను తీసుకొస్తారు. చివరి ట్రిప్పు వేళ ఆన్‌లైన్‌లోని పికప్ ట్రిప్పును మొదటి ట్రిప్పు వ్యక్తికి ఇసుకను తరలించి ఓటీపీ చెప్పించుకొని ఆన్‌లైన్‌ను క్లోజ్ చేస్తారు.

కొందరు ఆన్‌లైన్ లేకుండానే ఇసుకను అక్రమంగా తలిస్తున్నారు.

తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం..

ఇసుకను అక్రమంగా తరలిరంచే విషయంపై తనిఖీలు చేస్తాం. అక్రమంగా తరలిరంచినట్లు గుర్తిస్తే ట్రాక్టర్ యజమానులపై, ట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తాం. రోజుకు ఒక్క ట్రాక్టర్, ఒకటి లేదా రెండు ట్రిప్పులను మాత్రమే ఇసుకను ప్రభుత్వ అనుమతితోనే తరలించాలి.

- లక్ష్మి, తహసీల్దార్, పెబ్బేరు మండలం

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ



కొత్తకోటలో పరీక్ష కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఎస్పీ గిరిదర్

కొత్తకోట, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 6 కేంద్రాల్లో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఎస్పీ రావుల గిరిధర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, నలుగురి కన్నా ఎక్కువ మంది ఉండకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. పరీక్షలు రాయడానికి వచ్చే వారిని గంట ముందే కేంద్రానికి అనుమతించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. 6 కేంద్రాల్లో కలిపి 1309 మంది ఉదయం పరీక్ష రాయాల్సి ఉండగా.. 543 మంది హాజరు కాగా 766 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం పరీక్షలో సైతం 543 మంది పరీక్ష రాశారు. ఉదయం మధ్యాహ్నం పరీక్షలకు 50 శాతం మంది హాజరు కాలేదు.

పురాతన ఆలయంలో అభివృద్ధి పనులు



ఆలయానికి రంగుల డబ్బులు అందజేస్తున్న భక్తులు

పెబ్బేరు, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ వెనుక భాగంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయం వద్ద హిందూ జాగృతం సభ్యుల సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత చేయడంతో పాటు ఆలయానికి రంగులు వేసి అలంకరణ చేశారు. కార్యక్రమంలో పెబ్బేరు హిందూ సభ్యులు పాల్గొన్నారు.

కమిటీహాల్ పనులు ప్రారంభం

పెబ్బేరు అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారణ భక్తుల సౌకర్యం కోసం ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ సభ్యులు భక్తుల సహకారంతో విరాళాలు సేకరించి అభివృద్ధి పనులు ప్రారంభించారు. భక్తులు ఎవరైనా విరాళాలు అందించాలని నిర్వాహకులు కోరారు. ఈశ్వర్, శ్రీనివాస్, కిషోర్, బాలవర్ధన్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం జరిగేనా



మధ్యలో నిలిచిపోయిన జానంపేట, బున్యాదిపురం వంతెన నిర్మాణం

శ్రీరంగాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జానంపేట గ్రామ సమీపంలో వాగులో వంతెన కోసం నిధులు మంజూరై దశాబ్దం గడిచినా నేటికి ఎక్కడి గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. 2009-10 సంవత్సరంలో జూరాల ప్రాజెక్టు నిధుల నుంచి రూ.కోటి 68 లక్షలు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా.. పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుండా చేతులెత్తేశాడు. పనులు తీసుకున్న కాంట్రాక్టర్ ఇప్పటికే 12 పిల్లర్లు నిర్మాణం చేశారు. స్లాబ్ వేసే సమయంలో ఎస్టిమేట్‌లో అధికారుల పొరపాటుతో కాంట్రాక్టర్ ఆ పనులు నేను చేయలేనని చెప్పారు. అప్పటి నుంచి వంతెన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో కొల్లాపూర్, కర్నూల్, గద్వాలకు రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొల్లాపూర్ నుంచి వచ్చే వాహనాలు అయ్యవారిపల్లి, రంగాపురం, సూగూరు మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ వంతెన పూర్తయితే కర్నూల్, గద్వాల, కొల్లాపూర్‌కు దూరం తగ్గుతుందని వాహనదారులు తెలిపారు. ఇప్పటికే జానంపేట వాగు వద్ద రైతులు వరి ధాన్యం తరలించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తాత్కాలిక వంతెన నిర్మాణం కోసం రూ.పది లక్షలు మంజూరు చేయించి, చిన్నపాటి వంతెన నిర్మాణం చేశారు. ఈ వంతెనపై భారీ వాహనాలు పోవడానికి ఇబ్బందులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు పెద్ద వంతెన నిర్మాణం చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ వంతెన నిర్మాణం చేయడానికి జూరాల ఉన్నత స్థాయి అధికారులు ముందుకు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కొత్త ప్రభుత్వంలోనైనా ఈ వం తెన నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం..

ఏళ్ల తరబడి మూలకు పడ్డ వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి.. ఈ ప్రాంతంలో రాకపోకల అభివృద్ధికి కృషి చేస్తాం. దీంతోపాటు జానంపేట నుంచి తమ గ్రామం వరకు మంజూరైన రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి.

- విజయ గౌడ్, బున్యాదిపురం

ఒత్తిడి తీసుకొస్తాం..

జానంపేట, బున్యాదిపురం గ్రామాల మధ్యలో ఉన్న వాగుపై వంతెన నిర్మాణం చేయకుంటే ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. తాత్కాలిక వంతెనపై వాహనాలు రాకపోకలు ఇబ్బందులు ఉన్నాయి. వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలి. వ్యవసాయ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జానంపేట

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి

పాన్‌గల్, నవంబరు17, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కిష్టాపూర్ తండాకు చెందిన బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఫిర్యానాయక్ కుమారుడు కిషోర్ నాయక్(28) శనివారం బుద్దారం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి ఆదివారం స్వగృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో ఆయన వెంట మాజీ సర్పంచులు సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, చంద్రునాయక్, వెంకటయ్యనాయుడు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరీక్షకు తరలిన ఎన్యుమరేటర్లు
- నిలిచిన సమగ్ర సర్వే

వీపనగండ్ల, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : మండలంలో కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలకు హాజరయ్యారు. దీంతో కుటుంబ సర్వే కొంత అంతరాయం జరిగింది. మండలంలోని 14 గ్రామ పంచాయతీలో 52 మంది ఎన్యుమరేటర్లు కుటుంబ సర్వే చేస్తున్నారు. గ్రూప్-3 పరీక్షల కారణంగా 14 మంది సర్వేలో పాల్గొనలేదు. ఎనిమిది మంది పంచాయతీ కార్యదర్శులు గ్రూప్-3 పరీక్షలకు హాజరయ్యారు. ఉపాధ్యాయుల్లో కొందరు గ్రూప్-3 పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వెళ్లగా కొందరు పరీక్షలు రాయడానికి వెళ్లారు. మండలంలో ఇప్పటి వరకు 4000 కుటుంబాలను సర్వే చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

సర్వేను పరిశీలించిన తహసీల్దార్

అమరచింత : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే ఆదివారం ఆయా గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కేంద్రంతో పాటు నాగల్‌కడుమూర్, నందిమల్ల, కృష్ణంపల్లి, మిట్టనందిమల్ల, చంద్రఘడ్, నందిమల్ల ఎక్స్‌రోడ్డు, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సర్వే విజయవంతంగా కొనసాగింది. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు, ఆర్ఐ గోపాల్, ఎంపీవో నరసింహయ్య, ఎంఈవో భాస్కర్ సింగ్ తదితర అధికారులు పర్యవేక్షించారు.

రోలర్ స్కేటింగ్‌లో గోల్డ్ మెడల్

పెబ్బేరు రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గుమ్మడం గ్రామానికి చెందిన ఎస్ఎస్‌జై విద్యార్థి బంగారు పతకాన్ని సాధించారు. గుమ్మడం గ్రామానికి చెందిన గడ్డం సుధాకర్ కుమారుడు యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం, బంగారు పతకం సాధించాడు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలో రాష్ట్రస్థాయి బహుమతి, బెస్ట్ ఫెర్మాన్స్ సర్టిఫికెట్ సాధించడంతో గ్రామస్థులు, యువత అభినందించారు.



ప్రశంసాపత్రంతో ఎస్ఎస్‌జై

వసతులకు మోక్షం

- 40 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



కొనసాగుతున్న అండర్ డ్రైనేజీ పనులు

మదనాపురం, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో డబుల్ బెడ్రూంలను సుమారు రెండు సంవత్సరాల కిందట ప్రారంభించారు. ఇక్కడ 136 ఇళ్లు నిర్మించారు. కానీ డ్రైనేజీ, మంచినీటి వసతులు లేక చాలా మంది డబుల్ బెడ్రూంలలో నివాసం ఉండలేక కొందరు వెనుదిరిగారు. నిత్యం ఇళ్ల పక్కనే మురుగు నిలవడంతో నానాఅవస్థలు పడ్డారు. కాగా పైపులైన్ పనులకు రూ.30 లక్షలు, సెప్టిక్ ట్యాంక్‌కు రూ.15 లక్షలు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మంజూరు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేశారు. ఇప్పుడు డబుల్ బెడ్రూం వద్ద చుక్క నీరు కూడా రోడ్లమీద నిల్వ ఉండకుండా అండర్ పైపులైన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్‌లోకి వెళ్లేలా పనులు చేపడుతున్నారు. ఈ సౌకర్యాలను చూసి డబుల్ బెడ్రూంలోకి రాని మరికొంత మంది లబ్ధిదారులు ఇప్పుడు వస్తున్నారు. పనులు పూర్తి కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు కూడా వేస్తే సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని పేర్కొంటున్నారు.

గతంలో డ్రైనేజీలు లేక అవస్థలు..

గతంలో డ్రైనేజీలు లేక నానా అవస్థలు ఎదుర్కొన్నాం. ఇండ్ల మధ్యనే మురుగునీరు ఆగడంతో దాని నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోయాం. అంతే గాక దోమల ద్వారా తరుచు రోగాలు రావడం జరిగింది. ఇప్పుడు పనులు పూర్తి కావడంతో చాలా సంతోషంగా ఉంది.

- నర్సింహ

కాల్వకు గండి.. రైతులకు తప్పిన ముప్పు



కాలువకు గండి కొడుతున్న ఇరిగేషన్ అధికారులు

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రామన్‌పాడు రిజర్వాయర్ కుడి కాల్వకు గండి కొట్టడంతో రైతుల పొలాలకు నీరు చేరే ముప్పు తప్పిందని మేడపల్లి దేవరపల్లి తిప్పడంపల్లి, ఆరేపల్లి గ్రామాల రైతులు తెలియజేశారు. రామన్‌పాడు రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ ద్వారా సాగునీటికి విడుదల చేసే గేట్ మూసుకోకపోవడంతో రైతుల పొలాలకు నీరు చేరుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రాజెక్టు డీఈ నారాయణ స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మేడపల్లి పరిసర ప్రాంతంలోని కాల్వకు గండి కొట్టి వాగుకు నీటిని విడుదల చేయడంతో రైతులకు ముప్పు తప్పింది. ఇదిలా ఉండగా.. నార్లు పోసే వరకు మరో నెల రోజుల సమయం పడుతుంది. అప్పటి దాకా నీరు వృథా అయ్యే అవకాశం ఉంది. ప్రాజెక్టు అధికారులు తక్షణమే స్పందించి గజ ఈతగాళ్లను రప్పించి కుడి కాల్వ గేట్ మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే నీరు వృథా అయ్యే అవకాశం ఉందని గ్రామాల రైతులు కోరుతున్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు నిల్వ చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం మండల నాయకులు భీమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను పేరుకు మాత్రమే వారం క్రితం మంత్రి జూపల్లి ప్రారంభించారని తేమ, తాలు, తదితర కారణాలతో నెలలు గడుస్తున్నా.. వరి పంటలు కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పని చేసి పంటలు పండిస్తే చేతికి వచ్చిన వరి పంటను ప్రభుత్వం చిన్న కారణాలతో ధాన్యాన్ని కొనుగోలు చేయడం ఆలస్యం చేయడంతో, అకాల వర్షాలు పడి ధాన్యం తడిసిపోయే ప్రమాదం సంభవిస్తుందని రైతులు ఆవేదన చెందుతారని అన్నారు. మండల వ్యాప్తంగా వరి ధాన్యం రెండు నెలల నుంచి ఎక్కడ ఖాళీ భూములు ఉన్న చోట, ఖాళీ రోడ్ల మీద కల్లాల్లో ఎక్కడ చేసినా ధాన్యం రాశులతో దర్శనమిస్తున్నాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన తక్షణమే కొనుగోలు చేయాలని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే కొనుగోలు కేంద్రాల వద్దనే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు సూర్యవంశం రాము, కమలాకర్, రైతులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం, కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణ కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ చౌరస్తాలో హిందూ జ్ఞానవేదిక, ప్రబోధా సేవ సమితి కొత్తకోట వారి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. శరీరమున దేవాలయంలో బయట విషయాలను వీడి అంతర్ముఖులమై శరీరం లోపలికి చూస్తే ఆత్మదర్శనం జరుగుతుందని తెలిపారు. దేవాలయ రహస్యములు ఆయా గ్రంథాలలో గురువులు దాచి ఉంచారని తెలిపారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు రామచంద్రయ్య, భాస్కర్‌రెడ్డి, జహంగీర్, మాసన్న, శాంతి, అనిత, వెంకటమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామి పడి పూజ



ఆంజనేయ స్వామి పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెబ్బేరు, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో ఆంజనేయ స్వామి పడి పూజ కార్యక్రమం ఆదివారం పెబ్బేరులోని మాస్టర్‌మైండ్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఇక మాసంలో డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి ఆంజనేయ స్వామి మాల వేసి దీక్షను ప్రారంభించారు. ఇదే క్రమంలో హనుమంతుని పడి పూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మిట్ట హనుమాన్ దేవాలయం నుంచి మాస్టర్ మైండ్ స్కూల్ ఆవరణం వరకు ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హనుమంతుని పడి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతునికి అభిషేకాలు అష్టోత్తరాలు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా పార్కు

- నిండిపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు - పాములు వస్తున్నాయంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



అపరిశుభ్రంగా ఉన్న పార్కులో ఖోఖో ఆడుతున్న చిన్నారులు

వీపనగండ్ల, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చాపల వారి ఎల్లమ్మ గుడి పక్కన ఉన్న చిల్డ్రన్ పార్కు అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఎంతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన చిన్న పిల్లల ఆట స్థలంలో చెత్తచెదారంతో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. స్కూల్ నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన చిన్నారులు ఈ ప్రాంతంలో జారుడుబండ, ఊగడానికి ఏర్పాటు చేసిన పరికరాలపై ఆడుకుంటున్నారు. అపరిశుభ్రంగా ఉండటంతో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని చిన్నారులు వాపోతున్నారు. పిచ్చి మొక్కలు చెత్త చెదారంతో అపరిశుభ్రంగా ఉండటంతో విషసర్పాలు సంచారిస్తున్నాయని, వాటితో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో జరిగే ప్రమాదాల గురించి తెలియని అభం శుభం తెలియని చిన్నారులు ఆటలాడుకోవడం జరుగుతుందన్నారు. శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు చెప్పిన పట్టించుకోవడం లేదని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు తెలిపారు. పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు పార్కును శుభ్రం చేయాలని కోరుతున్నారు.